క్లుప్తంగా

అర్హులందరికీ పెన్షన్లు

రామభద్రపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక పెన్షన్ మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ రమామణి అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలో పెన్షన్ కోసం చేసుకున్న దరఖాస్తులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలో 450 మందికి పైగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించి అర్హులకు పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటరమణ, ఎంఈఓ తిరుమల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథవలసలో 'పొలంబడి'



జగన్నాథవలసలో పొలంబడి కార్యక్రమంలో ఏవో కన్నబాబు, రైతులు

వంగర: మండలంలోని జగన్నాథవలస గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏవో తట్టికోట కన్నబాబు మాట్లాడుతూ పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సమగ్ర వ్యవసాయ పర్యావరణ(ఏఈఎస్‌ఏ), శత్రుపురుగులు, మిత్రపురుగుల నిష్పత్తి ఆధారంగా క్రిమిసంహార మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. వరి పంటల సాగులో సమగ్ర నీటి యాజమాన్యం, ఆకు చివరి భాగం కత్తిరింపుతో పాటు ప్రతీ రైతు శాస్త్రవేత్తగా ఎదగాలన్నదే లక్ష్యం కావాలన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మ, రైతులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ సభను విజయవంతం చేయండి

రామభద్రపురం: ఎస్సీ వర్గీకరణ సాధించే క్రమంలో మండల కేంద్రంలో గురువారం నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్ మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సభకు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసూరుపాటి బ్రహ్మయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణరావు, లీగల్ అడ్వైజర్ మారిశెట్టి ఆనందరావుమాదిగ, కిల్లాడ రాజు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



రాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో ఇటీవల మృతి చెందిన జల్ల రాములు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, అన్ని విధాలుగా అండగా ఉంటామని బాధిత కుటుంబసభ్యులు త్రినాథరావు, గోవిందరావులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పి.లక్ష్మణరావు, ఎల్, రాంబాబు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

రాజాం: మండలంలోని గురవాం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ బుధవారం సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రికార్డుతో పాటు మధ్యాహ్న భోజనం రికార్డు పరిశీలించి, పలు సూచనలు చేశారు. నాణ్యమైన విద్యనందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సిబ్బందికి సూచించారు. అలాగే మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నారాయణరావు, హెచ్‌ఎం ఎస్.సబ్జాస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య దశ నుంచే నాయకత్వ లక్షణాలు

విజయనగరం అర్బన్: విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను బాల్య దశ నుంచే అలవరచుకోవాలని శ్రీచైతన్య పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక రింగ్‌రోడ్ చైతన్య పాఠశాల లో జరిగిన ప్రత్యేక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నిర్వహించిన జాతీయ జెండాలతో విద్యార్థుల కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఇటీవల జరిగిన పాఠశాల ఎన్నికల్లో ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్ బృందాలకు మెడల్స్ అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం:

రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. బుధవారం మండలంలోని గురవాం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ పరితపిస్తుంటారని, అందుకే ఆయన అందరికీ లబ్ధి జరిగేలా పథకాలు రూపొందించి, అమలుచేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలులోని పథకాలతో ప్రతీ ఇంటికి మేలు జరుగుతోందన్నారు. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.1 నుంచి రూ.3 లక్షల లబ్ధి చేకూరుతోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని పథకాలను జగనన్న ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని మంజూరు కావాలన్నా ఆ పార్టీ కార్యకర్తలకే దక్కేవన్నారు. ఇప్పుడు అలా కాదని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఓ వైపు గ్రామ సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు మేనిఫెస్టోలోని హామీలన్నీ నెరవేరుస్తూ అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. రోజురోజుకూ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గతంలో మోసం చేసిన టీడీపీ వాళ్లే మళ్లీ బూటకపు హామీలతో ప్రజలను బురిడీకొట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారిని నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చి, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, సర్పంచ్ బేరి రమణమ్మ, పార్టీ నేతలు ఆల్తి రాంబాబు, ఆల్తి సత్యనారాయణ, ఆల్తి రామ్మోహన్, చందక సంగంనాయుడు, చందక శ్రీనివాసరావు, కనుగుల సింహాచలం లావేటి లక్ష్మణరావు, ఆల్తి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు నక్క వర్షిణి, యాలాల వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షులు వాకముల్ల చిన్నంనాయుడు, వంజరాపు విజయ్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు..

రేగిడి: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. బుధవారం మండలంలోని పనసలవలస గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమన్నారు. ఆయన హయాంలో అవినీతి లేని పాలన కొనసాగుతోందన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, అందరూ బాగుండాలన్న సదుద్దేశ్యంతోనే అనేకానేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ జి.గోవిందనాయుడు, ఎంపీటీసీలు ఎం.శ్రీనివాసరావు, ఎస్.జనర్దానాయుడు, కె.నాగరాజు, పి.గౌరునాయుడు, ఎంపీడీఓ నాగమణి, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..



జగన్నాథవలసలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

తెర్లాం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గోపాలవలస, జగన్నాథవలస గ్రామాల్లో బుధవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొందాల కుమారి వెంకటరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో తెలియజేస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయనివిధంగా పరిపాలన సాగిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసినట్లు తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బొబ్బిలి, తెర్లాం మండలాల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎస్.బాబ్జీరావు, జెడ్పీటీసీ సభ్యుడు జి.లూర్థు రామారావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, సీనియర్ నాయకులు బి.అప్పలనాయుడు, టి.సత్యంనాయుడు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, హెచ్‌డీటీ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి, ఆప్కాబ్ ఎం.డి శ్రీనివాస్

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీఏసీఎస్ ఆధ్వర్యంలో డీసీసీబీ ద్వారా మంజూరైన కోటీ యాభై లక్షల రూపాయల రుణాలను పలువురు లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఆప్కాబ్ ఎం.డి శ్రీనివాస్ మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా డ్వాక్రా సంఘాలతో పాటు ఎస్టీ, ఇతరులకు వ్యక్తిగత, సంఘ రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, సీఈఓ జనార్దన్, పెరుమాళి పీఏసీఎస్ అధ్యక్షుడు సాంబరాజు, సీఈఓ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలి



రేగిడి: పారంపేట ఆర్‌బీకేలో ఈ-క్రాప్ నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

సంతకవిటి: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏవో పైల నవీన్ సూచించారు. బుధవారం మండలంలోని తాలాడ రైతు భరోసా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన గ్రామాల వారీగా చేపట్టాల్సిన పంట కోత ప్రయోగాలపై సమీక్షించారు. రైతులంతా తమ పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేసుకునేలా చూడాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని పారంపేట, ఉనుకూరు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఏవో మురళీకృష్ణ బుధవారం పరిశీలించారు. అనంతరం ఈ-క్రాప్ నమోదు ఆవశ్యకతను రైతులకు వివరించారు.

ఘనంగా టంగుటూరి జయంతి



రామభద్రపురం: ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు, తదితరులు



తెర్లాం : టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు

తెర్లాం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నేటి విద్యార్థులంతా టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

ఘనంగా..

బొబ్బిలి: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టంగుటూరి చిత్రపటానికి తహసీల్దార్ డి. రాజేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ బి. గౌరీశంకరరావు, సీఎస్‌డీటీ సాయికృష్ణ, రీ సర్వే డీటీ అప్పయ్య, ఎలక్షన్ డీటీ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

వంగర: మండలంలోని మద్దువలస గురుకుల పాఠశాలలో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ పట్టా పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ సూర్యకుమారి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

లేబర్ అధికారుల తనిఖీలు

బాడంగి: మండల కేంద్రంలోని పలు దుకాణాలను లేబర్ అధికారులు బుధవారం తనిఖీ చేసి బాల కార్మికులున్నదీ, లేనిదీ ఆరా తీశారు. బాలకార్మికులు ఎవ్వరూ పట్టుబడలేదని లేబర్ అధికారులు శ్రీనివాసులు, కె.చంద్రశేఖర్, కె.కిరణ్‌చంద్ర తెలిపారు. తనిఖీల్లో ఆరోగ్యశాఖ అధికారులు ఎం.కిశోర్‌కుమార్, మహిళాశిశు సంక్షేమశాఖకు చెందినఅనిల్‌కుమార్, ఎన్‌జీఓ జి.జానీరాణి, పోలీసులు పాల్గొన్నారు.

అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉండాలి

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు వార్డు సచివాలయాల అడ్మినిస్ట్రేటర్లకు సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమైన ఆయన ప్రతిరోజూ ప్రతీ వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. వార్డుల వారీగా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన చోట సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టాలన్నారు. అంతకుముందు మున్సిపల్ శాఖ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని, రాజాం పట్టణంలోని అభివృద్ధిపై మాట్లాడారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, ఎన్విరాన్‌మెంట్ ఏఈ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలి

- ఎమ్మెల్యే శంబంగి



ఎంపీడీఓ రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

తెర్లాం: ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న తరుణంలో మండలాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేయాలని తెర్లాం ఎంపీడీఓ రామకృష్ణను బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికై ఇటీవల అవార్డు తీసుకున్న రామకృష్ణను జగన్నాథవలసలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే గోపాలవలస ఉపాధి క్షేత్ర సహాయకురాలు మాధవి జిల్లా స్థాయిలో ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎంపిక కావడంతో ఆమెను కూడా అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు వేణుగోపాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, గోపాలవలస సర్పంచ్ జి.కుమారివెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ డోల రాజేశ్వరరావు

బొబ్బిలి: సివిల్ సప్లైస్ డీటీ కుమార్తె ఆరాధ్య పుట్టిన రోజు సందర్భంగా తహసీల్దార్ రాజేశ్వరరావు చేతులమీదుగా పేదలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో గల మెర్సీవాల్ (దయగల గోడ) వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

'చంద్రయాన్' సంబరాలు



బొబ్బిలి: రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగుల సంబరాలు

బొబ్బిలి: చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో బొబ్బిలి పట్టణంలో బుధవారం విజయోత్సవాలు జరిగాయి. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పరస్పరం అభినందించుకుని స్వీట్లు పంచుకున్నారు. జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. అలాగే గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, లంక రమేష్, వనమిత్ర అధ్యక్షుడు కె. కృష్ణదాసు, తదితరులు పట్టణంలోని ప్రధాన రోడ్లపై జాతీయ పతాకాలను ఎగురవేస్తూ సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు.

తిలకించిన విద్యార్థులు

బాడంగి: చంద్రయాన్ - 3లో ల్యాండర్ మాడ్యూల్ చంద్రుడిపై దిగే సన్నివేశాన్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వీక్షించారు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు.

టీడీపీ నాయకులకు అభివృద్ధి కనిపించలేదా...?

- జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, తదితరులు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, గ్రామపెద్దలు

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జరుగుతున్న అభివృద్ధి టీడీపీ నాయకులకు కనిపించడం లేదా అని జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, గ్రామపెద్దలు ప్రశ్నించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని ఎన్‌హెచ్ 26 నుంచి కొట్టక్కి గ్రామంలోకి వెళ్లే రహదారి పూర్తిగా పాడవడంతో సుమారు దశాబ్దకాలంగా ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చొరవతో రహదారి మంజూరైందని చెప్పారు. రోడ్డు వేస్తున్న సమయంలో కురిసిన వర్షాలకు కొద్దిగా మట్టి జారిపోవడంతో టీడీపీ నాయకుడు బేబినాయన, తదితరులు లేనిపోని యాగీ చేశారన్నారు. నిబంధనల ప్రకారమే రోడ్డు వేస్తున్నట్లు సంబంధిత అధికారులు చెప్పడంతో టీడీపీ నాయకులు తోకముడిచారని తెలిపారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సుజయ్‌కృష్ణ రంగారావు మంత్రిగా ఉన్నప్పటికీ రోడ్డు మంజూరు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని గుర్తించాలని హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పికొండ అనురాధ, ఎంపీటీసీ ప్రతినిధి సామిరెడ్డి చంద్రయ్య, గ్రామ పెద్దలు అప్పికొండ గంగునాయుడు, బంకురు కన్నంనాయుడు, ఎ. శ్రీరాం, ఎం. తిరుపతినాయుడు, ఎ. చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

అన్నదానం

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు వేల మందికి పైగా పాల్గొని, స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. అంతకుముందు అయ్యప్పస్వామికి భక్తులు ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుల రేజేటి సత్యనారాయణమూర్తి శర్మ పాల్గొన్నారు.

విశ్వసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

రేగిడి: మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరంలో హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ మనిషి మంచి చేయాలన్న ఆలోచనతో మెలిగితే మెరుగైన సమాజం ఆవిష్కృతమవుతుందన్నారు. కార్యక్రమంలో వేమకోటి ప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి

వంగర: గ్రామాల్లో ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమైన ఆయన గ్రామాల్లో జీడి, మామిడి మొక్కలు పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో ఎం.సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం పరిశీలన



వంటలు రుచి చూస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మండలంలోని పెరుమాళి మోడల్ స్కూల్, కళాశాల బాలికల వసతిగృహాన్ని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మితో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో ఎంతమంది విద్యార్థినులు ఉంటున్నారు.. ఏమైనా సమస్యలున్నాయా అని వసతిగృహం సంక్షేమాధికారి లలితకుమారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటలను పరిశీలించారు. స్నానపుగదులు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. అలాగే విద్యార్థినులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించాలని సూచించారు.


126 కొత్త పెన్షన్ల మంజూరు

వంగర: మండలానికి కొత్తగా మరో 126 పెన్షన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి, కొత్తగా పెన్షన్లకు ఎంపికైన వారి అర్హతలను పరిశీలించారు. మండలంలోని అన్ని వెల్ఫేర్ అసిస్టెంట్లు కొత్త పెన్షన్ల వెరిఫికేషన్ చేపట్టి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కె.భగవతి, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి..

వంగర: స్థానిక కేజీబీవీలో విద్యార్థుల విద్యాప్రమాణాలపై ఎంఈవో-2 వై.దుర్గారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యాప్రమాణాలు మెరుగుపడాలని అన్నారు. బుధవారం కేజీబీవీని సందర్శించిన ఆయన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, ప్రతీ విద్యార్థి విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యాశాఖ నిర్దేశించిన లెర్న్ ఏ వర్డ్ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో బి.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: పట్టణంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు బుధవారం పరిశీలించారు. అన్ని వార్డుల్లో పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు. ప్రజలు కూడా వీధుల్లోకి వచ్చిన బండికి చెత్తను అందించాలన్నారు. తడిచెత్త పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి, ఎప్పటికప్పుడు డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు.